



sahanamvande.com epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 15-03-2026 ఆదివారం | సంపుటి-1 సంచిక : 356 EDITOR: ROHINI




# విజయ్‌పై పవనాస్త్రం

## బీజేపీతో విజయ్ పొత్తుకు పవన్ రాయబారం



- తమిళ పాలిటిక్స్‌లో పవర్ స్టార్ ప్రకంపనలు
- రాయబారం వెనుక కాషాయ భారీ వ్యూహం
- ఇప్పటికే విజయ్‌తో పవన్ కళ్యాణ్ చర్చలు
- దళపతిని చేరదీసేందుకు కమలం కసరత్తు
- ద్రవిడ రాజకీయాల్లో రాజకీయ కలకలం

**తమిళనాడు రాజకీయ రణరంగం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల గుప్పిట్లో ఉన్న తమిళ నాట తమ జెండా ఎగురవేయాలని బీజేపీ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో సినీ గ్లామర్‌ను రాజకీయ శక్తిగా మలుచుకున్న విజయ్‌ను తమ కూటమిలోకి ఆహ్వానించేందుకు బీజేపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఈ కీలక బాధ్యతను రాజకీయ ఎత్తుగడల్లో ఆరితే రిన ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అప్పగిం చడం ఇప్పుడు దక్షిణ భారత రాజకీయాల్లోనే చర్చనీయాం శంగా మారింది. - సహనం వందే, అమరావతి**

రాజకీయాల్లో మిత్రపక్షాల పాత్ర ఎంత కీలకమో ఆ మిత్రపక్షాలను సమన్వయం చేసే నాయకుడి పాత్ర అంతకంటే కీలకం. విజయ్‌తో పవన్ కళ్యాణ్‌కు ఉన్న సుదీర్ఘ వ్యక్తిగత పరిచయం ఇప్పుడు బీజేపీకి అతిపెద్ద ఆశాకిరణంగా మారింది. ఇద్దరూ సినీ రంగం నుండి రాజకీయాల్లోకి వచ్చిన వారు కావడంతో ఒకరి ఆలోచనలు మరొకరికి సులభంగా అర్థమవుతాయి.

విజయ్‌కి ఉన్న భారీ ప్రజాదరణను బీజేపీ జాతీయ విధానాలతో అనుసంధానం చేసే ఒకే ఒక్క 'కనెక్టింగ్ లింక్'గా పవన్ కళ్యాణ్ ఈ మధ్యవర్తిత్వానికి ఎంపిక య్యారు. ఇది కేవలం ఒక పార్టీని కలపడం మాత్రమే కాదు... తమిళ రాజకీయాల్లో ఒక కొత్త కూటమిని సృష్టించే భారీ పొలిటికల్ ఇంజనీరింగ్.

### వ్యూహాత్మక లాభం... బీజేపీ అంచనా



తమిళనాడులో బీజేపీ ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు ఓట్ల శాతం. విజయ్ పార్టీ టీవీకేలో చేరుతున్న యువత, మార్పు ఆశిస్తున్న ఓటర్ల మద్దతు బీజేపీకి దక్కితే అది రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని క్షణాల్లో మార్చేయగలదు. బీజేపీని సిద్ధాంతపర మైన శత్రువుగా ప్రకటించిన విజయ్‌ని రాజకీయ వాస్తవాల వైపు మళ్లించే క్రమంలో పవన్ కళ్యాణ్ ద్వారా జరుపుతున్న ఈ చర్చలు చాలా లోతైనవి. ఇది ఎన్నికల పొత్తుకు మించిన భవిష్యత్ రాజకీయ భాగస్వామ్యం కోసం వేస్తున్న పునాది.


### క్షేత్రస్థాయిలో రాజకీయ ప్రతిష్టంభన...

ఒకవైపు సీబీఐ నోటీసుల వ్యవహారం... మరోవైపు తన పార్టీని ఒంటరిగా నడపాలనే విజయ్ ఆశయం మధ్య ఇప్పుడు నలిగిపోతోంది. అయితే రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదని పవన్ కళ్యాణ్ వంటి అనుభవజ్ఞుడైన నాయకుడు విజయ్‌కు వివరించడం... ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని ఎదుర్కోవా లంటే జాతీయ కూటమి మద్దతు ఎంత అవసరమో నొక్కి చెప్పడం వెనుక బీజేపీ ఆడుతున్న పెద్ద ఆట ఉంది. విజయ్ వంటి పాపులర్ నాయకుడిని తమ కూటమిలోకి తీసుకురావడం ద్వారా డీఎం కేకు మాత్రమే కాకుండా అన్నాడీఎంకేకు కూడా పెద్ద షాక్ ఇవ్వాలని కమలం పార్టీ చూస్తోంది.

### విజయ్ పంథాపై ఆసక్తి...

పవన్ కళ్యాణ్ చేసిన ఈ రాయబారం కేవలం ఒక ప్రయత్నమా లేక ముగింపు దశకు చేరుకున్న ఒప్పందమా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. విజయ్ తన పంథాలో ఒంటరిగా ముందుకు సాగుతారా లేక పవన్ కళ్యాణ్ ద్వారా బీజేపీతో చేతులు కలిపి రాజకీయ 'మేజిక్' చేస్తారా అనేది అసెంబ్లీ ఎన్నికల నాటికి స్పష్టమవుతుంది. ఏది ఏమైనా పవన్ కళ్యాణ్ ప్రవేశంతో తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకున్నాయి.

**- బొల్లోజు రవి, సీనియర్ జర్నలిస్ట్**



# పార్లమెంటులో కలిశెట్టి భాషా విప్లవం!

## తెలుగులో రాజ్యాంగం... ఎంపీ కల సాకారం

- విజయనగరం ఎంపీ అప్పలనాయుడు కృషి
- స్పీకర్ ఓం బిర్లా కృషితో ఫలించిన ఆశయం

**ప్రతి అక్షరం ఒక చరిత్ర. ప్రతి మాట ఒక వారసత్వం. మన మాతృభాషలో చదువుకున్నప్పుడు కలిగే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం. సుదీర్ఘ కాలం పార్లమెంటు లైబ్రరీలో కనిపించని ఆ తెలుగు రాజ్యాంగపు వెలుగు ఇప్పుడు విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ప్రయత్నంతో మళ్ళీ మన ముందు నిలిచింది. ఒక చిన్న విజ్ఞప్తి... దానికి ఒక పెద్ద మనసు తోడైతే మార్పు ఎలా వస్తుందో ఈ ఘటన మనకు గుర్తు చేస్తోంది. - సహనం వందే, న్యూఢిల్లీ**

ఒక ఎంపీగా పార్లమెంటులోకి అడుగుపెట్టిన అప్పలనాయుడు మనసులో ఒకటే ఆలోచన మెదిలింది. ఈ దేశానికి దిశానిర్దేశం చేసే రాజ్యాంగ గ్రంథం తన ప్రజల భాషలో లేకపోవడం ఆయనను కలచివేసింది. మనం గెలిచిన ప్రజాస్వామ్యం లో మన భాష ఎందుకు ఉండకూడదు? ఆయన గుండెల్లో తలెత్తిన ఆ ప్రశ్న ఆయనను స్పీకర్ ఓం బిర్లా గది వైపు నడిపించింది.

### ఒక వినమ్ర విన్నపం

స్పీకర్ ఓం బిర్లాను కలిసినప్పుడు అప్పలనాయుడు తన కోరికను చాలా స్పష్టంగా చెప్పారు. తనకు పదవుల కన్నా తన భాషకు దక్కాల్సిన గౌరవం ముఖ్యం అని ఆయన భావించారు. తెలుగు రాజ్యాంగ పుస్తకం పార్లమెంటు లైబ్రరీలో ఎందుకు ఉండాలో వివరించినప్పుడు ఆ మాటల్లో ఎంతో గాఢత ఉంది. ఆ పిలుపును స్పీకర్ ఓం బిర్లా నిర్లక్ష్యం చేయలేదు.

### కార్యరూపం దాల్చిన కల

స్పీకర్ ఆదేశాల మేరకు యంత్రాంగం కదిలింది. ఏళ్ల తరబడి ఉన్న లోటును పూడ్చే పని మొదలైంది. కేవలం రెండు రోజుల క్రితం ఆ పుస్తకం పార్లమెంటు లైబ్రరీ అల్మారాల్లోకి చేరింది. ఒక ఎంపీగా అప్పలనాయుడు పడిన తపన ఇప్పుడు తెలుగు వారికి గర్వకారణంగా మారింది.




స్పీకర్ ఓం బిర్లాతో ఎంపీ అప్పలనాయుడు

### గెలిచిన మాతృభాష

అవిశ్వాస తీర్మానం వీగిపోయిన రోజు ఒక భావోద్వేగపూరితమైన సందర్భంలో అప్పలనాయుడు మళ్ళీ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. కృతజ్ఞతలు చెప్పే సమయంలో స్పీకరే స్వయంగా ఆ తీపి కబురును అందించారు. ఆ క్షణం అప్పలనాయుడి కళ్ళలో మెరిసిన సంతోషం... భాష పట్ల ఆయనకు ఉన్న ప్రేమకు నిదర్శనం.

### చరిత్రలో చిరస్థాయి

రాజ్యాంగం అంటే కేవలం కాగితాల సముదాయం కాదు... అది ఒక జాతి ఆత్మ. ఇప్పుడు ఆ ఆత్మ తెలుగు భాషలో పార్లమెంటులో కొలువైంది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చింది. ఇది అప్పలనాయుడు కృషికి, స్పీకర్ ఓం బిర్లాకు దక్కిన గుర్తింపు.



ఎంపీ అప్పలనాయుడు


### తర్వాతి తరాలకు సంకేతం

మన భాషకు, మన సంస్కృతికి విలువ ఇచ్చినప్పుడే ప్రజాస్వామ్యం పరిపూర్ణం అవుతుంది. అప్పలనాయుడు బాటలో మరిన్ని ఇలాంటి అడుగులు పడాలి. భవిష్యత్తు తరాలు మన రాజ్యాంగాన్ని మాతృభాషలో చదువుకుంటున్నప్పుడు ఈ చిన్న ప్రయత్నం ఒక గొప్ప చరిత్రగా మిగిలిపోతుంది.

# ఏఐ ప్రయోగశాలగా ఇరాన్ యుద్ధక్షేత్రం

## కోడ్, ఆల్గారిథమ్స్ రాస్తున్న మరణ శాసనం

- ఇరాన్ రణక్షేత్రంలో అమెరికా ఏఐ అకృత్యం
- యంత్రాల కబంధహస్తాల్లో మానవత్వం
- ఏఐ యుద్ధం... చిన్నారుల మరణాలపై మౌనం
- యుద్ధం తెచ్చిన ఏఐ... శాంతిని తేలేదేంటీ?




**ఇరాన్ యుద్ధభూమి ఇప్పుడు అమెరికా ప్రయోగిస్తున్న ఏఐకి ప్రయోగశాలగా మారింది. ఇక్కడ మనుషులు ఆయుధాలను పట్టుకోవడం లేదు. మనుషుల ప్రాణాలను నిర్ణయించే అధికారాన్ని యంత్రాలకు కట్టబెట్టారు. ప్రాజెక్ట్ మావెన్ అనే కృత్రిమ మేధ వ్యవస్థ అమెరికా యుద్ధ తంత్రంలో భాగంగా ఇప్పుడు మారణహోమాన్ని సృష్టిస్తోంది. యుద్ధం మొదలైన తొలి రోజే ఈ యంత్రాల అంచనాల వల్ల 168 మంది అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఇది యుద్ధం కాదు... ఆల్గారిథమ్స్ రాస్తున్న మరణ శాసనం. ఒక సాఫ్ట్‌వేర్ కోడ్ అమాయకుల ప్రాణాలను ఎలా బలితీసుకుంటుందో ఈ ఘటన ప్రపంచానికి కళ్లకు కడుతోంది. - సహనం వందే, హైదరాబాద్**

ప్రాజెక్ట్ మావెన్ అంటే కేవలం ఒక సాఫ్ట్‌వేర్ కాదు. ఇది డ్రోన్ కెమెరాల ద్వారా వచ్చే గంటల కొద్దీ దృశ్యాలను, శాటిలైట్ సమాచారాన్ని సెకన్లలో జల్లెడ పట్టి ఎవరిని చంపాలో నిర్ణయించే ఒక ప్రాణాంతక వ్యవస్థ. మనిషి ప్రమేయం లేకుండానే లక్ష్యాలను ఖరారు చేసే ఈ వ్యవస్థ ఇప్పుడు యుద్ధ నిబంధనలను తుంగలో తొక్కింది. ఇరాన్ లోని ఒక ప్రాంతాన్ని శత్రువుల స్థావరంగా పొరపాటుగా గుర్తించిన ఈ ఏఐ వ్యవస్థ క్షణాల్లో చేసిన దాడిలో 168 మంది చిన్నారులు తుదిశ్వాస విడిచారు. ఆల్గారిథమ్స్ చేసిన తప్పుకు ప్రాణాలు కోల్పోయిన ఆ చిన్నారుల కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు?

### వేగమే వినాశనానికి దారి

అమెరికా సైన్యం ప్రాజెక్ట్ మావెన్ ను ఒక సాంకేతిక అద్భుతంగా డప్పు కొట్టుకుంటోంది. 10 లక్షల కంటే ఎక్కువ డేటా పాయింట్లను ఏఐ క్షణాల్లో ప్రాసెస్ చేస్తుందని గొప్పలు చెప్పుకుంటోంది. అయితే ఈ వేగమే ఇప్పుడు అమాయకుల పాలిట శాపంగా మారింది. శత్రువులెవరో, సామాన్యులెవరో గుర్తించడంలో ఈ వ్యవస్థ తీవ్ర వైఫల్యం చెందింది. యుద్ధం అంటే కేవలం డేటా విశ్లేషణ కాదు... అక్కడ మనుషులు ఉంటారు. కానీ ఈ ఏఐ వ్యవస్థకు మానవత్వం తెలియదు. దానికి తెలిసింది కేవలం టార్గెట్ ను కూల్చడం మాత్రమే.

### ఎవరు బాధ్యులు?

సాంకేతికత ఎప్పుడూ లోపరహితం కాదు. అల్గారిథమ్స్ తప్పులు చేసినప్పుడు వాటిని నిలదీసే దిక్కులేదు. 168 మంది చిన్నారుల మరణానికి బాధ్యత ఎవరిది? వ్యవస్థదా లేదా ఆ కోడ్ రాసిన యంత్రాలదా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేవాడు లేడు. ఇరాన్ తో యుద్ధంలో సాంకేతికత ఇచ్చే డేటాపై పూర్తిగా ఆధారపడటం వల్ల యుద్ధం మరింత ప్రమాదకరమైన మలుపు తీసుకుంది. జవాబుదారీతనం లేని ఈ యుద్ధ యంత్రం ముమ్ముందు మరెన్ని ప్రాణాలను బలి తీసుకోనుందో ఎవరికీ తెలియదు.

### ముగింపు లేని మారణహోమం

ఈ సాంకేతిక యుద్ధం అగ్రదేశాల అహంకారానికి, అమాయకుల రక్తానికి మధ్య జరుగుతున్న పోరాటంగా నిలుస్తోంది. రాబోయే రోజుల్లో యుద్ధభూమిలో ఏఐ పాత్ర మరింత పెరగనుంది. కానీ ఇది శాంతిని తీసుకురాదు. కేవలం మరణాలను పెంచుతుంది. 168 మంది చిన్నారుల మరణం ఒక హెచ్చరిక... కానీ అమెరికా మాత్రం తన ఏఐ యంత్రాలను ఉసిగొల్పుతూనే ఉంది. ఈ క్రూరమైన మారణహోమం ఎప్పుడు ఆగుతుందో కాలమే నిర్ణయించాలి. యుద్ధభూమిలో ఏఐ పాత్ర మరింత పెరగనుంది. కానీ ఇది శాంతిని తీసుకురాదు. కేవలం మరణాలను పెంచుతుంది.

**- బొల్లోజు రవి, సీనియర్ జర్నలిస్ట్**